# ప్రియత

బండి లక్ష్మీనరసింహారెడ్డి




## పావని

పావని మనసు నవనీతం  పావని సొగసు కమనీయం

ఆమె అనురాగవతి   అపరంజి బొమ్మ

ఆమె నవ్వితే చాలు—వెన్నెలలు కురుస్తాయి, నవరత్నాలొలుకుతాయి  కన్నుల్లోనూ, చూపుల్లోనూ ఒక వింతయిన సోయగం

ఆమె కదిలితే చాలు కలహంస హొయలు పలికితే చాలు సెలయేటి ఝరులు

ఒక్కమాటలో చెప్పాలంటే సౌందర్యమంతా ఆమె సొత్తు  ఆమె సమక్షంలో సమస్తలోకం సద్దుమణిగిపోతుంది

ఒకానొక నిండు పున్నమి వెన్నెల రోజున అదృష్టవశాత్తు ఆగ్రాలోని  తాజ్‌మహలును సందర్శించడం జరిగింది  అప్పుడు అనుకున్నాను — 'అతిలోక సుందరియైన కన్య సైతం, అప్పుడే పన్నీటితో జలకాలాడి పరిమళాలు వెదజల్లుతూ ఎదుట నిలిచినాసరే ఈ తాజ్‌మహలు సౌందర్యంముందు, మిలమిలలాడే ఆ సుందరి అందం తప్పక వెలవెలపోతుంద'ని

కాని కొన్నాళ్ళకు ఆనాటి నా అంచనా తారుమారయింది  అదే పావని అందాన్ని చూచిన క్షణాన  ఆ క్షణంలో నా కళ్ళు అపురూపంగా నందనవనాన్ని సందర్శించాయి  ఏవేవో దివ్యలోకాలకు నన్ను మత్తుగా నడిపించాయి'

అంతటి అద్భుతమైన సౌందర్యం ఆమెది

ఆ అందం నా స్వంతం కాబోతున్నది రోజు

కాదు కాదు  ఏనాడో ఆమె నాకు స్వంతమై, సమస్తమై సర్వం అర్పించుకున్నప్పటికీ, ఆ బంధాన్ని, ఆ అనుబంధాన్ని ఈ రోజు శోభనం రాత్రి పేరిట శాశ్వితంగా బందీని చేసుకోబోతున్నది

నిన్నటివరకూ ఆమె నాకు కేవలం ప్రియురాలు  కాని నేటినుండి సహధర్మచారిణి  ఇది కేవలం లోకం దృష్టిలో మాత్రమే  మా ఇద్దరిదీ పూర్వం గాంధర్వ వివాహం  ఆత్మసాక్షిగా మాకేనాడో పెళ్లయిపోయింది

అగరువత్తులు ఆ గదినిండా సువాసనలు వెదజల్లుతూ ఆహ్లాదకరమైన వాతావరణానికి జీవం పోస్తున్నాయి  మెర్క్యురీ లైటుకాంతి—పాలవెన్నెలను తలపింపజేస్తున్నది  మల్లెపువ్వుల సౌరభం మత్తెక్కిస్తున్నది  గులాబీలు, సన్నజాజులు, మందారాలు తమ అందాలను చాటుకుంటున్నాయి  పందిరిమంచం పూలమాలలతో నిండి హంసతూలికాతల్పాన్ని సైతం అవహేళన చేస్తున్నట్లున్నది  టీపాయ్‌పై వెండి పళ్లెరంలో అందంగా సర్దబడి, నవనవలాడుతూన్న మామిడిపళ్ళు, అరటిపళ్ళు, బత్తాయిలు, ద్రాక్ష, ఆపిల్, మొదలయిన పళ్ళు  సగర్వంగా తలలెత్తి తమ అదృష్టానికి మిడిసిపడుతున్నట్లున్నాయి

అదొక దివ్యమైన మధురానుభూతి దీర్ఘంగా క్షణాలు గడిచిపోతున్నా, పావని ఇంకా చెంతకు రాలేదేమిటనే ఆరాటం – నన్ను మరో లోకంలో విహరింపజేస్తున్నది

సరిగ్గా అయిదేళ్ళ క్రితం – ఆరునెలలపాటు, మద్రాసు మహానగరంలో పావనీ, నేనూ కలిసి తిరుగని ప్రదేశమంటూ లేనేలేదు మెరీనాబీచ్, గోల్డెన్‌బీచ్, వి జి పి గార్డెన్సు అన్నానగర్ పార్కు, టి నగర్ – పానగల్ పార్కు, మహాబలిపురంలో సముద్ర తీరాలు, మైసూరులో బృందావనం, ఇంకా చెప్పాలంటే కొడైకెనాల్, ఊటీ, మొదలయిన అందాలు చిందే ప్రదేశాలలో– ఒకరి కౌగిట్లో మరొకరం కరిగిపోతూ, రతీ మన్మధుల వలె ప్రణయ రాజ్య మేలిన వాళ్ళమే

ఆ మధురమైన సామ్రాజ్యంలో ఎన్నెన్నో ఊసులు, ఎన్నెన్నో బాసలు ఒకరిపై ఒకరికి ఎనలేని విశ్వాసం ఒకరిని విడిచి మరొకరు బ్రతికి మనలేమనే తపన అనుభూతి దివ్య సంకల్పం కృతనిశ్చయం సంతోష సాగరాలు మా ముందు హోరులెత్తేవి

మహా మహా నగరాలలోని – టూ స్టార్, త్రీ స్టార్ హోటల్లు మా పాలిట దేవేంద్ర భవనాలు కాగా, రాత్రింబవళ్లనే తేడా లేకుండానే గడిపిన రోజులను గుర్తు తెచ్చుకుంటుంటే – ఒళ్లంతా ఆనందంతో పులకరిస్తున్నది ఆ ఆనందపు ఘడియలను ఒక్కొక్కటి నెమరు వేసుకుంటుంటే రమణీయమైన రంగుల స్వప్నంలా, స్వర్గధామంలా అనిపిస్తున్నది

అయితే నాటికీ నేటికీ ఒక్కటే తేడా ఆనాడు నేను సర్వాంగ సుందరుడనని పలువురిచే ప్రశంసల నందుకుంటే, ఈ రోజు ప్రమాద వశాత్తు కుడిచేయిని కోల్పోయిన వికలాంగుడను!

స్వల్పకాలంలో సంపాదించిన డబ్బు లక్షలకు లక్షలు బ్యాంకుల్లో మూలుగుతూ ఉన్నా యం బి, యం డి, [మెడిసిన్] డి యం, [కార్డియాలోజి] యం ఏ, యం యస్, [కార్డియాలోజి] యఫ్ ఆర్ యస్ టి యం [లండన్] యఫ్ సి సి పి [యు యస్ ఏ] డిగ్రీలు నా పేరుకు ప్రక్కగా ఎంత అందంగా మెరుస్తూ ఉన్నా హైదరాబాదు నగరంలో ఎకరపు విస్తీర్ణపు భూభాగంలో ప్రైవేటు హాస్పిటల్‌ను స్వంతంగా నిర్మించుకొని ఉన్నా మంచి ఫీజిషియన్‌గా, హార్ట్ స్పెషలిస్టుగా – దేశం నలుమూలలా నాకు ఎనలేని కీర్తిప్రతిష్ట లున్నా అంగవైకల్యమనే అసంతృప్తి జీవితం ముందు ఏ ఐశ్వర్యమూ నాలో స్పందన కలిగించడం లేదు

లోపభూయిష్టమయిన జీవనపథం ఏదో వెలితి మరేదో నైరాశ్యం నన్నతిగా పీడిస్తున్నది

విధి యనబడే అసంకల్పిత శాసనం ముందు మనం నిమిత్త మాత్రులమేనేమో

భరించలేని బాధ తీవ్రతరమై వేధిస్తున్నది ఈ శుభ సమయంలో వేదననంతా మరచిపోవాలని నాలో ఎంతగానో తాపత్రయం ఎనలేని సంఘర్షణ ఆవేదన ఆరాటం షాంపైన్ షాంపైన్

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ పావని తలుపులు తెరిచి లోనికి ఎచ్చింది కాదు కాదు ముత్తైదువలు పరిహాసాలాడుతూ చిలిపిగా, బలవంతంగా ఆమెను లోనికి పంపి తలుపులు మూసివేసారు గుమ్మం చెంతనే నిలచిన పావనిని చూస్తుంటే అజంతా చిత్ర సుందరి గుర్తుకు వస్తున్నది

చిలక పచ్చని పట్టుచీర, అదేరంగు బ్లౌజు, మెడలో వజ్రాలహారం, చెవులకు మెరిసిపోయే జోకాలు, చేతికి బంగారు గాజులు, తల నిండా పూదండ **ఓహా!** అంతగా అలంకరింపబడిన ఆమెను చూస్తుంటే అమృత పాత్ర నదించే జగన్మోహినిలా, దివి నుండి భువికే తెంచిన దేవకన్యలా అనిపిస్తున్నది నవ్వుతూ సిరులొలుకుతూ నా ముందు ప్రత్యక్షమయి నట్టున్నది

బిడియపడుతూ గడియ వేయకుండా అక్కడే స్థాణువులా నిలిచిపోయిన ఆ సుందరిని చూస్తుంటే ప్రపంచంలోని అందాలన్నీ నా ముందు ప్రోదియై పసందుగా విందు చేసుకోవడం కోసం పొందు పరచబడినాయేమోననే భావం ఆ క్షణాన నాలో కలిగింది

“పావనీ ఇలారా” ఆర్ద్రతతో కోటి వీణల రాగంతో నా స్వరం స్వాగత వచనాలు పలికింది

క్రీగంటితో నావైపొకసారి దృష్టిని సారించి, మళ్లీ తల వంచుకుంది క్షణాలు గడిచి పోతున్నాయ్ కడకేమనుకుందో ఏమో నెమ్మదిగా తలుపులు బిగించి, అలవోకగా నడిచి నా చెంతకు వచ్చి నిలిచింది చేతిలో ఉన్న పాలగ్లాసును నా పెదిమల కందిస్తూ

“పావనీ! నీకింత బిడియం పనికిరాదు సుమా! ఆనాటి సహచర్యం అప్పుడే మరిచి పోయావా?” ఆమెను దగ్గరకు లాక్కుంటూ అక్కున చేర్చుకున్నాను

“పావనీ, ఇలాంటి రోజు మనకేమీ కొత్త గాదుగా నీ శరీరంలోని అంగాంగమూ నాకు చిరపరిచితమే పూర్వపు రోజులు గుర్తుకు వస్తున్నాయి పరుగుపరుగునా నా వద్దకు వస్తావనీ బిగి కౌగిట్లో బంధిస్తావనీ, పూర్వంలా ముద్దులతో ముంచేత్తావనీ ఈ క్షణంకోసం నేనెంతగా పరితపించానో మానసికంగా నేనెంత కృశించిపోయానో నీకు తెలుసా? కాని ఇలా బేలలా ఏమీ తెలియని ముగ్ధలా ”

మరింత మౌనం తీయని స్పందన మిలమిలమెరిసే ఆ కళ్లల్లో కళ్లు కలిపితే యుగాలుసైతం క్షణాలుగా మారిపోతాయి

నా కౌగిల్లో కరిగిపోతున్న అమెలో చలనం ఆమె సున్నితమైన హస్తద్వయం నా మెడ చుట్టూ పూలహారంకాగా మరింత చేరువకు జరిగింది ఒకనాటి చిలిపి చేష్టలను ప్రదర్శించకున్నా, మౌనంగానే తీయని పెదవుల నందించింది సాంతంగా మరింత గాఢంగా నన్నల్లుకు పోయింది ఆమె ఎర్రని నునులేత బుగ్గలపై అలుముకున్న సిగ్గుల మొగ్గల నొక్కొక్కటీ నా పెదవులతో ముచ్చటగా అందుకోవడం నావంతయింది

చందన పరిమళమిచ్చే మరికొంత మత్తులో ఆమె అంగాంగమూ సున్నితంగా స్పృజించాను అయిదేళ్లక్రితం తొలిసారి కలయికలో చూసిన ఆమె అందం ద్విగుణీకృతమైనదేతప్ప ఏ మాత్రం తరిగిపోలేదు ఏదో పరవశం అదేదో మైకం ఎన్నేళ్ల విరహతాపమో ఎన్నాళ్ల తపఃఫలితమో

అదొక మధురానుభూతి

దివ్యానుభూతి

కౌగిట్లో గువ్వలా ఒదిగి, గట్టిగా నన్ను పొదివి పట్టుకున్న ఆమెతో “పావనీ, ఈ ప్రస్తుత జీవితంతో రాజీపడి నీవేం సుఖపడతావు పావనీ? యాక్సిడెంట్‌లో అప్పుడే ప్రాణం పోయినా బాగుణ్ణు ”

సున్నితమైన తన వ్రేళ్లతో పెదవులు మూస్తూ – “ఎప్పుడూ అలా అనుకోకండి మీరు బ్రతికారు నాకంతే చాలు ” స్థూలంగా నాలో తిష్టవేసుకున్న విషాద

## లవ్ ఈజ్ బౌండ్

నీ చూపు
ధనుర్విముక్త విశిఖంలా
నా హృదయాన్ని గాయపరిచిన దరిమిలా
మధురమైన ఆ గాయాలకి మందు
నీ పొందునో, లేదా మరణమనో
అమాయక, అజ్ఞానపు ఎడారిలో
ఒంటరినై ప్రేమ ఒయాసిస్సును
వెదుక్కుంటూ వొచ్చిన ఇన్నేళ్లకితెల్సింది,
ఇది వొట్టి దేహమని
కర్మసంచిత గేహమని
మట్టికి ఇది ప్రియనేస్తమని!
ఐనాగానీ ప్రియే
నీ కనురెప్పల నీడల్లో
నీ కనుపాపల ఊయెల్లో
విశ్రమించాలన్న కోరిక చావక
నడుస్తూనే వున్నాను యుగాలుగా
ఆశల సుడిగాలులకి
కళ్లలో పడిన దుమ్మని
తుడుచుకుంటూ
త డు ము కుం టూ

**– ఎమ్ దివాకర్ బాబు**

ఛాయలను దూరంగా తరిమివేయాలనే తాపత్రయంతో నన్ను మరింత హత్తుకుపోయింది

"ప్ఛ్! యాక్సిడెంట్ ఆ యాక్సిడెంట్‌లో విరిగిన చేయి ఆపరేషన్ నెల రోజులకు పైగా ట్రీట్‌మెంట్ ఆర్టిఫిషియల్ లింబ్ " చెలరేగిన అల చెరగని కల సుదీర్ఘమైన నిట్టూర్పు!

చెంగున గెంతి, టేబిల్‌పై ఉన్న షాంపైన్ బాటిల్ తెరిచి, నిండు గ్లాసును నా పెదిమల కందించింది నా కళ్లల్లోకి గోముగా చూస్తూ విదేశాల్లో అలవడిన ఒకే ఒక్క అలవాటు — యాక్సిడెంట్ షాక్‌వల్ల రెట్టింపయింది కొంత రిలీఫ్

అవగాహన, ఆప్యాయత, పావనికి మారు పేర్లేమో మనసున మల్లెలు గుభాళించగా ఆమెకు జోహారు లర్పించాను

"ఏమండీ నావల్లనే కదండీ మీకీ ప్రమాదం జరిగింది, మీ బంగారం వంటి బ్రతుకు దుర్భరమైపోయింది నేను దురదృష్టవంతురాలిని " బరువుగా నా గుండెలపై వాలిపోయింది పొరలివస్తున్న ఆమె కన్నీటిధారను చూసి విచలుడనైనాను తీయని అనురాగం వీడని అనుబంధం' చలించని అభయహస్తం మమతల ఊయల గాఢ పరిష్వంగంలో ఆమె బ్రహ్మ — తీరికగా చూడముచ్చటగా మలచిన సుందర విగ్రహం !

అయితే, పూర్వం నాకు తెలిసిన పావనికి — జన్మజన్మలకు మరుపురాని ఒక గుర్తు—ఎప్పుడూ చూడాలనిపించే గులాబీ రంగులో మెరిసిపోయే పొత్తికడుపు పొంకంగా తీర్చిదిద్దినట్లున్న నాభికి కుడివైపు పెసరుగింజ పరిమాణంలో తేనెరంగు పుట్టుమచ్చ ప్రతిసారీ ఆ చోట గిలిగింతలు పెడుతూ చేసే అల్లరికి మెలికలు తిరిగిపోతూ, నవ్వులతో కవ్వించే పావని అదొక 'చిలిపి చేష్ట ఆరు నెలల సహవాసం

స్పందించే ఆ స్పర్శతో తరించిపోవాలనే తపనతో — నా కళ్లు వెదికాయి కాని అక్కడ ఆ మచ్చ కనిపించలేదు

జీవితంలో ఇది మరొక పెద్ద షాక్! ప్రమాదం వల్ల గాయాలతో నా మనసు సంక్షోభంలో పడిపోయినా, ఆనాటి అనుభవాలన్నీ స్మృతి పథం నుండి తప్పిపోలేదు

"పావనీ!" అన్న గర్జింపుతో 'నీవు పావనివి కావా?' అన్న ఖచ్చితమైన అభ్యంతరాన్ని స్ఫురింపజేస్తూ బిగ్గరగా అరిచాను ఆమె కళ్లల్లోకి తీక్షణంగా చూస్తూ

హోరుగాలిలో రెపరెపలాడే చిగురుటాకులా చలించిపోయిందామె అంతలోనే నిబ్బరం ఆమెనొక నేరస్తురాలిగా ఎంచి ఏహ్యభావంతో చూస్తున్న నా చూపులను తట్టుకోలేని స్థితి ఆమెది నా కళ్లలోకి సూటిగా చూడలేకపోతున్నది

# ప్రియత

పావని కాదు ఆమె ముమ్మాటికీ కాదు ముమ్మూర్తులా పావనిని పోలిన సుందరి పావని లాంటి రూపురేఖలు, హావభావాలు కలిగియుండి, నన్ను మభ్యపెట్ట చూస్తున్న చతురురాలు ఆమె ఎవరు? ఎవరామె నన్ను నిలువెత్తునా దహిస్తున్న సమస్య ఆక్షేపణ కసి కసి

ముఖానికి చేరువగా ఉన్న ఆమె చెక్కిళ్లను ఆ కసితోనే గట్టిగా పళ్లు బిగుసుకున్నాయి ఆమెలో సన్నని మూలుగు బాధననుభవిస్తూ కూడా నన్ను మరింత గాఢంగా అల్లుకుపోతూ బిగికౌగిలి బలమైన ఉచ్ఛ్వాస నిశ్వాసలు అందం అందం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది మత్తు మత్తు షాంపైన్ మైకం అవ్యక్తమైన అనుభూతి నిర్వచించలేని తమకం స్వర్గధామం .. నేను లొంగిపోయాను క్షణాలు దొరలిపోయాయి

వేడి నిట్టూర్పులు దీర్ఘనిశ్వాస . హాహారవం

ఆమెను దూరంగా నెట్టివేస్తూ అన్నాను—

"నీవెవరివో కాని—కన్యవు నీవు పావనివి కానేకాదు ఎందుకంటే ఆమె కన్య కాదు గనుక ఆరునెలల సహచర్యం మాది నీవెంతగా ఆమెని పోలి ఉన్నా అనుభవంతో తెలుస్తున్న నిజమిది అసలు నువ్వెవరు? నా పావనినేంచేశావు?" కోపంతో గద్దించాను

"నేను నిజంగా పావనినే! మీరు పొరబడుతున్నారేమో? నన్ను నమ్మండి ప్రస్తుతం మిమ్మల్ని అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్యను గుర్తుంచుకోండి " రోషంతో అంటున్న ఆమె కంఠంలోని నిశ్చలత్వానికి ఆశ్చర్యపోవడం నా వంతయింది

భరించలేని బాధ మస్తిష్కంలో తీరని అలజడి అదే అదనుగా ఎంచి షాంపైన్ నింపిన గ్లాసును నాకందించింది—నన్ను లాలిస్తూ, తన కనువుగా నన్ను లోబరుచుకుంటూ

మధురమైన మధువు, సుందరమైన మగువ అందులో నవ వధువు అదొక స్వర్గలోకం

తెల్లవారింది కాదు నిద్రలేచేసరికి మధ్యాహ్నమయింది

ఆమె పావని కానేకాదని నిరూపించాలనుకున్నాను దూరంగా వెళ్లిపోవాలనీ, నా పావనిని మళ్లీ వెతుక్కోవాలనీ అనుకున్నాను కాని నా మనసులోని ఊహను పసిగట్టినట్లుగానే ఆ సాయంత్రం ఆపిల్ పండు కోస్తూ తన కుడిచేతి వేళ్లకు గాయం చేసుకుంది బలంగా లోతుగా దిగిన కత్తి గాటుకు రక్తం బాగా స్రవించింది. క్లినిక్‌కు తీసుకువెళ్లి బ్యాండేజ్ వేయించడంతో సరిపోయింది ఆమె దస్తూరీతో పావని నాకు వ్రాసిన ఉత్తరాలలోని దస్తూరీని పోల్చి చూపించాలనుకున్నా

కాని ఈ సంఘటనతో, తాత్కాలికమైన అంతరాయం ఏర్పడింది

కావాలనే కుడిచేతికి తానై తాను ఏర్పరచుకున్న గాయంగా, నేను గమనించక పోలేదు

ఆమె నా ఐశ్వర్యాన్ని వరించిందా? కేవలం ఒక సందేహం అలా అయి ఉండదు ఆమె చిన్నారి కన్నెగానే నా జీవితంలో ప్రవేశించింది అయితే పావనిలా ఎందుకు చలామణి కావాలని కోరుకుంటున్నది? మరొక ధర్మ సందేహం లేక నా కీర్తిని చూసి దాసోహమయిందా? అలా అయి ఉండదు ఏదో చరిత్ర ఉండి తీరుతుంది దీర్ఘాలోచనలతో నా కళ్లు మూతలు పడుతున్నాయి బరువుగా

ఆ సుందరి ననుజేర వస్తున్నది— అనురాగ దేవతయై

ఒకనాడు— మామూలు పేషేంటుగా వచ్చి, విజిటింగ్ వార్డులో కూర్చున్న పావని నా కంటబడింది ఆ ఒక్క చూపులోనే నా మనసు ఆమెకు అంకితమైపోయింది లోనికి వెళ్లి కన్‌సల్టింగ్ రూంలో ఆమె రాకకోసం ఎదురు చూస్తున్నాను సరిగ్గా ఆమె నలభై నాల్గవ

## శాస్త్ర పరిశోధనలో రెండవ స్థానం!

జపాన్ 1982 ఆర్థిక సంవత్సరంలో శాస్త్రీయ పరిశోధనకు ముప్పై వేల కోట్ల రూపాయలు ఖర్చుచేసింది ఇందుకై మునుపెన్నడూ ఇంత డబ్బు ఖర్చుపెట్టలేదు శాస్త్రీయ పరిశోధన వ్యయం విషయంలో ప్రపంచంలో అమెరికా తరువాతి స్థానం జపానుదే ఈ మొత్తంలో ఎక్కువ ఖర్చుపెట్టింది ప్రైవేటు రంగం

శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకై జపాన్ ఖర్చుచేసిన మొత్తంలో అధికభాగం, అంటే 27 వేలకోట్లు ప్రకృతి శాస్త్రాలకు సంబంధించిన పరిశోధనలకు వెళ్లింది రోదసీ పరిశోధనల, సముద్ర, మానవ పరిసరాల పరిశోధనల వాటా గణనీయంగా పెరిగింది ఇంధన పరిశోధన వ్యయం రు 3,150 కోట్లు ఇందులో ఒక్క అణుశక్తి పరిశోధనకే రు 1,220 కోట్లు ఖర్చయింది జీవ సాంకేతిక శాస్త్రరంగంలో పరిశోధనలు ఇటీవల ముమ్మరమైనందు వల్లనేమో, జీవ సంబంధ శాస్త్ర పరిశోధనలకు పెద్ద మొత్తమే (రు 3,000 కోట్లు) వ్యయమయినట్లు తెలింది (జవా)

పేషెంటుగా నా వద్దకు వచ్చింది అది నా లక్కీ నెంబరు

"పేరు ?"

"పావని!" వీణాతంత్రులు మ్రోగాయి

అరె పావని నా నర్సింగ్ హోం పేరు కూడా అదే పావని నర్సింగ్ హోం కోడంబాకం హై రోడ్డు మద్రాసు

"ఏం చేస్తుంటారు ?" వృత్తిరీత్యా అది నాకప్రస్తుతం

"యం యస్సీ, ఫైనలియర్!" సూటిగా నా కళ్లల్లోకి చూస్తూ జవాబు చెప్పింది

ఇద్దరి కళ్లూ కలుసుకున్నాయి మౌనంగా పలుకరించుకున్నాయి మనసులు రెండూ ఒకటయినాయి అంతవరకూ ఏ స్త్రీ నన్నాకట్టుకోలేదు అదే విచిత్రం

మెడికల్ చెకప్ డయాగ్నస్ చేయడం మళ్ళీ మళ్ళీ రోజుల తరబడి ప్రత్యక్షం

ఆ పరిచయమే ఆరునెలల సహచర్యానికి నాంది పలికింది ఒకరిని విడిచి మరొకరు ఉండలేని నిరీక్షణం ఒకరిపై ఒకరికి ఎనలేని గౌరవం అపారమైన నమ్మకం ఆ విశ్వాసం తోనే కలియికలోని మాధుర్యం చవిచూసాం

జీవితాంతం పావనియే నా జీవిత భాగస్వామి తిరుగులేని నిశ్చయం ఏక పత్నీవ్రతమే నా ఏకైక లక్ష్యం వేరెవ్వరి ప్రమేయమూ లేనిది మా జీవిత బంధం దానికితోడు డాక్టరు హోదాలో విపరీతమైన ఆర్జన స్వేచ్ఛా జీవనం

మా ఇద్దరి మధ్యా ఒక పెద్ద అఖాతంలా— అమెరికాలో యఫ్ సి సి పి డిగ్రీ చేయడం కోసం మిత్రుని ప్రోద్బలం వల్ల ఆయాచితంగా పంపిన దరఖాస్తు ఆమోదింపబడటం వీసా చేతికందడం రెండేళ్ల ఎడబాటుకు ఇద్దరమూ సహృదయంతో అంగీకరించడం వెంట వెంట జరిగిపోయింది

# ప్రియత

ఆనాటి అప్పటి ఎడబాటే — ఈ నా దుస్థితికి కారణ భూతమయింది

రెండేళ్లలో డిగ్రీ పూర్తిచేసుకొని స్వదేశం తిరిగి వచ్చేసరికి పావని ఎక్కడా కనిపించలేదు హఠాత్తుగా, నాలుగు నెలలనుండి జవాబు రావడం ఆగిపోయేసరికి, ఏదో కీడును శంకించాను అలాగే అయింది

మద్రాసు చేరుకున్న వెంటనే 16, అజీజ్ నగర్‌లో ఉంటున్న ఆమె ఇంటికి వెళ్లితే - ఇల్లు ఖాళీచేసి వాళ్ల నాన్నతోబాటు వెళ్లిపోయారని తెలిసింది ఆమె స్వస్థలమైన నెల్లూరుకు ప్రయాణమయ్యాను —ఫలితం శూన్యమే అయింది ఇంటినీ ఉన్న ఆస్తినీ అమ్ముకున్నారనీ, ఎక్కడికి వెళ్లిపోయారో తెలియదనీ

భారంగా వెనుదిరిగివచ్చి, మళ్లీ మద్రాసు నగరమంతా ఆమెకోసం పిచ్చిగా వెదికాను వెదిగి వెదికి వేసారిపోయాను పత్రికాప్రకటనలిచ్చినా ఆశించిన ఫలితం దక్కలేదు పావని పావని నా పావని ఏమైపోయింది ?

మానసికపరమైన పెద్ద అఘాతం ఎంత మరిచిపోదామనుకున్నా, మరుపురాని పావని రూపం

స్థలం మార్పుకోసం హైదరాబాదుకు తరలిరాక తప్పలేదు అదీ మిత్రుల సలహాతోనే

నాకున్న డిగ్రీలు తలవని తలంపుగానే ప్రాక్టీసును పెంచాయి సంపాదన సంపాదన హోదా కీర్తి ప్రతిష్టలు అయినా ఏదో వెలితి అసంతృప్తి వేదన స్మృతిపథంలో పావని

ఒకరోజున — ఆకాశవాణి శ్రోతలకు — పేరు పొందిన హార్టు స్పెషలిస్టుగా నేనివ్వబోయే ప్రత్యేక ఇంటర్వ్యూ కార్యక్రమం ఉండగా, స్టుడియోలో రికార్డింగ్ పూర్తి చేసుకొని, ఫియట్ కారులో బయలుదేరాను నాంపల్లి రోడ్డుమీదుగా హాస్పిటల్‌కు తిరిగి వస్తున్నాను అల్లంత దూరంలో, రోడ్డుకు రెండవవైపు చివర హఠాత్తుగా పావని నా కంట బడింది ఆ క్షణంలో నా మనసు ఎగిరి గంతేసింది అయిదేళ్ళ దీర్ఘ నిరీక్షణ తరువాత అక్కడ పావని కనిపించడంతో ఆనందానికి అవధులు లేకపోయాయి అవును ఆమె అచ్చం పావనియే ఆటో ఎక్కబోతున్న పావని జీవితంలో మళ్ళీ ఆమె కనిపించడం దుర్లభమేమో ? ఆతృత టెన్షన్ డ్రైవ్ చేస్తున్న నేను సడెన్ బ్రేకులువేస్తూ, చేయి ముందుకు చాచి సైగ చేస్తూ "పావనీ !" అంటూ గావుకేక వేసాను

ఆమె తృటిలో నావైపు చూసింది ఆమె వైపే చూస్తున్నాను అంతే స్పీడుగా వచ్చిన ఎదుటి బస్సు — రోడ్డువైపు బయటకు చాచి ఉన్న నా చేయిని ఢీకొనడం హస్తం రక్తసిక్తమైపోవడం రోడ్డంతా లీలగా పరుగులు తీస్తున్నట్లు కళ్లు బైర్లు క్రమ్మడం అంతే తెలుసు

తెగిపోయిన చేయి ఆపరేషన్ నలభై రోజులు పేషెంటుగా హాస్పిటల్ జీవితం చావలేక బ్రతుకు

పావనితోబాటు ఆమె తండ్రి ఉమ్మడిగా చేసిన సపర్యలు — నన్ను సజీవుణ్ణి చేసాయి ఒక మనిషిగా తీర్చిదిద్దాయి

ఈనాటివరకూ ఆమె అలా పావనిగానే చెలామణీ అవుతూ, నాతో విపరీతమైన సాన్నిహిత్యాన్ని కోరి, కడకు నా జీవితంలో భాగస్వామిగా ప్రవేశించిన ఆమె పట్ల ఎందుకో కొంత అభిమానం ముంచుకొస్తున్నది నా ప్రేమ కోసం పరితపిస్తున్న ఆమె పవిత్రత నన్నమితంగా ఆకర్షిస్తున్నది ఎంతటి చతురురాలు


అయినా నా పావని కోసం ఎడతెగని ఆలోచన ఈ చిక్కు సమస్య విడివడనిది

ఆ రోజు ఆమె — తన ఆప్తురాలైన సుజాతతో కలిసి షాపింగుకని కారులో బయలుదేరింది అదే మంచి అదను ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలనే ఉద్దేశంతో — ముందుగానే ఆమెకు తెలియకుండా వ్యానిటీ బ్యాగ్‌లో నుంచి 'కీబంచ్'ను సంగ్రహించడం జరిగింది అది తప్పు పని, కాని తప్పని పరిస్థితి

గాడ్రెజ్ బీరువా తెరిచాను ఊహు ఫలితం కనిపించలేదు అలా వెదుకుతూనే సేఫ్టీ లాకర్ కూడా తెరవడంతో నా కళ్లు మెరిసాయి

ఆమె ఎవరో తెలిసిపోయింది స్కూల్ ఫైనల్, ఇంటర్, డిగ్రీ మొదలయిన సర్టిఫికేట్లున్న ఫైలు ఆమె పేరు రాగిణి

ఆ ఫైలుకు ప్రక్కగానే ఉన్న ఆల్బంను చూస్తున్నప్పుడు ఒకచోట నా కళ్లు నిలిచి



పోయాయి పావనిని పోలిన రాగిణి  రాగిణిని పోలిన పావని

ఇద్దరిదీ ఒకే పోలిక  వయసు తేడాతో ఇద్దరూ ఒకే చోట  ఒకరి ప్రక్కన మరొకరు

అదొక మిస్టరీ  నాలో ఏదో కలవరం తూలి పడబోయాను  అంతలోనే నిబ్బరం మనో నిబ్బరం

పట్టు విడువని విక్రమార్కుడిలా ఇంకా వెదుకుతున్నాను  అరలోపలి భాగంలో ఒక మూల వెండి భరిణలో ఆభరణాలు  అటు ప్రక్కనే ఒక డైరీ

వారం రోజుల క్రితం వరకే వ్రాయబడి ఉన్న డైరీఅది—

తేది 18–9–1983

" నా కోసం ప్రమాదానికి గురియైన డాక్టరుగారిని చూస్తూ ఉంటే నాకు విపరీతమైన జాలి ప్రేమ  నేనే పావని ననుకొని పాపం చేయి పోగొట్టుకున్నారు  ఆ పాపం నాదే కదా  వారి బంగారం వంటి భవిష్యత్తు నా వల్లనే కదా దోపిడీకి గురి అయింది  హాస్పిటల్లో చేర్చాక పావనీ  పావనీ  అంటూ వందలసార్లు పలువరిస్తుంటే— వారి గాఢమైన ప్రేమను తలచి, నా మనసు కరిగి నీరైపోయింది

అందుకే అప్పుడే నిర్ణయించుకున్నాను పావనిలా చలామణీ కావాలనీ  అక్కయ్యలా నటించాలనీ  జీవితాంతం వారికి చేదోడుగా నిలిచి, అసంతృప్తికి తావులేకుండా— వసంతగానం చేయాలనుకున్నాను  కాని ఈ రోజు నా ఆశలన్నీ వమ్మయిపోయాయి  నేను పావనిని కాదని గుర్తించారు  అదే నా దౌర్భాగ్యం ...


అయినా నాలో అదే నిశ్చయం ఎలాగైనా పావనిని మరిపించాలనీ  వారి జీవితం నందన వనం కావాలనీ  ఆ బలమైన కోరికతోనే రాగిణిగా నా జీవితం చాలించాను — పావనిలా రాణించాలని  నేను పావనిగానే వారి హృదయంలో కలకాలం నిలిచిపోవాలని ఆరాటం

పిల్లలు లేని కారణంగా చిన్నాన్న పెంపకంలో, నేను అక్కయ్యకు చాలా దూరంగా ఉండడం కారణాన నేనెవరో వారికి తెలియదు  పావని చెల్లెలుగా నన్ను గుర్తించలేకపోయారు  లేకపోతే రాగిణిగా, ముద్దుల మరదలుగానే నన్నభిమానించే వారు  పావనిగా అపోహకు తావు లేకుండా ఉండేది  'ఆంజీనా'తో ప్రారంభమైన జబ్బు — 'హార్టెటాక్'తో అక్కయ్య జీవితాన్ని కాటువేసి ఉండకపోతే "

ముందుకు సాగలేదు నా చూపులు  ఇక చదువలేకపోయాను

"పావనీ" భోరున ఏడుస్తూ కుప్పలా కూలిపోయాను

కళ్లు తెరచేసరికి బెడ్‌పై నేను  ఎదురుగా నా అసిస్టెంట్ శ్రీధర్  సమయానికి వచ్చినట్లున్నాడు  అప్పుడే ఇంజక్షన్ చేసాడు కాబోలు




"హౌ ఆర్‌యూ డాక్టర్!" నా కళ్లల్లోకి చూస్తూ చిన్న అభ్యర్థన

" యామ్ ఆల్‌రైట్ " నా చూపుల్లో దీనావస్థ, దీర్ఘమైన నిట్టూర్పు

"బీ బ్రేవ్ డాక్టర్ ! " నెమ్మదిగా భుజం తట్టూ, బీరువాలో అన్నీ సర్దానని చెప్పి నా చేతికి తాళాలందించాడు  కృతజ్ఞతలు తెలియజేసాను

అంతలోనే బయట కారు శబ్దం వినిపించింది

"పావని గారొస్తున్నారు ! " చిరునవ్వులు చిందిస్తూ, నా గది నుండి నిష్క్రమించాడు

దరహాసం మేళవించిన పలుకరింపుతో — ఆప్యాయంగా నా కళ్లలోకి చూస్తూ లోనికి ప్రవేశిస్తున్న రాగిణి  కాదు  పావనిపై నా చూపులు నిలిచిపోయాయి ★